ఎన్నాళ్లీ దారి కష్టాలు..!

- ఈఏడాది కూడా తిప్పలు తప్పడం లేదు
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న వైనం
- శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్న గ్రామస్తులు



కచికంటి మార్గంలో ఉన్న వాగు

ఆదిలాబాద్‌రూరల్: స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా.. ఇంకా చాలా ఆదివాసీ, గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు లేవు. వర్షాకాలం వచ్చిందంటే చాలు తమ గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లే బురద రోడ్డుపై ఎలా ప్రయాణం చేయాలని ఆందోళన చెందుతున్నారు. అత్యవసర సమయాలో వారి బాధలు వర్ణతీతం. ఇదిలా ఉండగా ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది తలెత్తకుండా ప్రతీ గ్రామానికి బీటీరోడ్డు సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాల్లో ఉన్న వాగులపై వంతెనలు నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇస్తున్నారు కానీ, నిర్మించడం లేదు. మండలంలోని చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు లేవు. కొద్దీపాటి వర్షం కురిస్తే చాలు వాగులు పొంగి వరద నీరు ప్రవాహించడంతో రాకపోకలు నిలిచాయి.

కష్టాలు తప్పేలా లేవు..

తమ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలోని కచికంటి సమీపంలోని వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని జిల్లా కేంద్రానికి అనుకొని ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిట్యాల్‌బోరి గ్రామానికి చెందిన గిరిజనులతో పాటు కచికంటి గ్రామానికి చెందిన రైతులు ఏళ్ల తరబడి ప్రజా ప్రతినిధులను, అధికారులను కోరుతున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న తమ పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గిరిజన గ్రామాల దుస్థితి ఎలా ఉంటుందో అర్థం అవుతుంది. ప్రస్తుతం ఆ గ్రామం గుండా వెళ్లేందుకు వాగులపై వంతెనలు లేకపోవడంతో బంగారుగూడ గ్రామం మీదుగా అటవీ ప్రాంతం నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. అటవీ అధికారులు రాకపోకలకు నిరాకరిస్తే అడవిలోనే ఉండాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. వంతెన నిర్మించకపోవడంతో ఈఏడాది కూడా కష్టాలు తప్పవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల సర్వే

మండలంలోని చిట్యాల్‌బోరి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలోని కచికంటి సమీపంలో గల వాగుపై వంతెన నిర్మాణం చేపట్టడంతో పాటు రెండున్నర కిలో మీటర్ల బీటీరోడ్డు నిర్మాణం కోసం గత పది రోజుల కిందట సర్వే చేపట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. చింతల్‌బోరి, కచికంటి రెండు మార్గాల గుండా రోడ్డు, ఆయా ప్రాంతాల్లో వంతెనల నిర్మాణాల కోసం సర్వే నిర్వహించారు. నిధులు మంజూరైతే ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, హైబ్రిడ్ అన్యూటి (ప్రైవేట్, ప్రభుత్వ) భాగస్వామ్యంతో పనులు చేపట్టే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

చిట్యాల్‌బోరి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో బీటీ రోడ్డుతో పాటు ఆ గ్రామం మీదుగా వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న వాగులపై వంతెనల నిర్మాణాల కోసం గత పది రోజుల కిందట సర్వే చేపట్టారు. నిధులు మంజూరు కాగానే ఆయా నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– సంతోష్, ఏఈ, పీఆర్, ఆదిలాబాద్ రూరల్

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి



పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని నవేగావ్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వర్షకాలం సమీపిస్తున్నందున నిర్మాణాలు వేగం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ద్వారా బిల్లులు మంజూరు చేయిస్తామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: మండలంలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ రోజు గ్రామాల్లో పర్యటించాలన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారికి మరుగుదొడ్లు నిర్మించుకునే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల నిర్మించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు



మొక్క నాటుతున్న సిబ్బంది

బోథ్: సొనాల మండల కేంద్రంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకలను బుధవారం నిర్వహించారు. 25 రోజుల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం సొనాల గ్రామ పంచాయతీ పరిసరాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట రమణ, యోగిత, గ్రామ పంచాయితీ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి




వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణాలకు రూ.20 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి కోరారు. బుధవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. 170 సర్వే నెంబర్ కాలనీలో కరెంటు సౌకర్యంతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణాలకు రూ. 10 లక్షలను మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు కుంటాల రాములు, గణేష్ పాల్గొన్నారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలి

బోథ్: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు పూర్తిస్థాయి రైతుభరోసా నిధులు విడుదల చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు చేస్తున్న పంట భూములకి పెట్టుబడి కింద ఆర్థిక సాయం ఎకరానికి రూ. 12000 ఇస్తామని చెప్పిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. యాసంగి పంటలో కూడా రైతు భరోసా నిధుల పూర్తి స్థాయిలో జమ కాకపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. నాలుగెకరాలు అంతకన్నా ఎక్కువగా ఉన్న రైతులకు వెంటనే రైతు భరోసా జమ చేయాలని కోరారు.

టీడీపీకి పూర్వ వైభవం తీసుకువస్తాం



మాట్లాడుతున్న నాయకులు

బోథ్: తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకువస్తామని మండల కన్వీనర్ మల్లెపూల శివారెడ్డి అన్నారు. బుధవారం తెలుగుదేశం ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో తెలుగుదేశం జెండా ఎగురవేశారు. నాయకులు చందు, పూంద్రు నర్సారెడ్డి, గొర్ల నారాయణ, గొర్ల కిషన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీలది లోపాయికారి ఒప్పందం'



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్, బీజేపీల లోపాయికారి ఒప్పందంతో ప్రజలకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. తర్నం బ్రిడ్జ్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే లక్ష్మీపూర్‌కు చెందిన లాంగ్నే దత్తు వరద నీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమన్నారు. బాధిత కుటుంబానికి తక్షణమే రూ. 25 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వంతెన నిర్మాణానికి బీఆర్ఎస్ హయాంలో రూ.40 కోట్లు మంజూరు చేసి ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, మంత్రి సీతక్క, జిల్లా కాంగ్రెస్ నేతలు సరిగా స్పందించలేదని ధ్వజమెత్తారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రావుత్ మనోహర్, మార్శెట్టి గోవర్ధన్, అడప తిరుపతి, బట్టు సతీష్, సంతోష్, కల్పప్‌రెడ్డి, మార్య సురేందర్, మహేశ్ పాల్గొన్నారు.

లన్గే దత్తు కుటుంబాన్ని ఆదుకోవాలి

సాత్నాల: లాన్గే దత్తు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం భోరాజ్ మండలంలోని తర్నం బ్రిడ్జి వద్ద దత్తు గల్లంతైన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణంలో జరుగుతున్న తీవ్ర జాప్యంతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే రైతు దత్తు కొట్టుకపోవటం జరిగిందన్నారు. వర్షాకాలం ఆరంభంలో వంతెన కూల్చివేయడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, కాంగ్రెస్ మంత్రి ప్రజాఅవసరాల పట్ల అవగాహన లేకపోవడం పూర్తిగా వారి నిర్లక్ష్యల ధోరణికి అద్దం పడుతుందన్నారు.

అహల్యాబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న మఠాధిపతి

ఆదిలాబాద్: అహల్యాబాయినీ ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి స్వామీజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాల కృష్ణ మఠంలో బుధవారం అహల్యాబాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొని, ఆమె చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం పుస్తకాలను పలువురు భక్తులకు పంపిణీ చేశారు. స్వామీజీ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మంలో మహిళలను నారీశక్తిగా పూజిస్తారన్నారు. హైందవ వీరులను గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క హిందువుపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు జ్యోతిరెడ్డి, అనిత, ప్రఫుల్ వజే పాల్గొన్నారు.

నువ్వుల పంట వర్షార్పణం



పంటను చూపిస్తున్న మహిళ రైతు

బేల: మండలంలోని సిర్సన్న రెవెన్యూ గ్రామ శివారులో మహిళ రైతు గేడం అర్పణకు చెందిన రెండెకరాల నువ్వు పంట మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పూర్తి తడిసింది. కోత దశలో అకాల వర్షాలతో పంట మొత్తం దెబ్బతింది. రూ.20 వేల పెట్టుబడితో సాగు చేసిన పంట పూర్తిగా నేలపాలై పూర్తిగా నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

'రైతులను వేధిస్తే సహించేది లేదు'

నేరడిగొండ: రైతులను వేధిస్తే సహించేది లేదని సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోడు భూముల సమస్య ఉందన్నారు. చాలా మంది రైతులు ఏళ్లుగా అటవీ భూములే ఆధారంగా జీవనం సాగిస్తున్నారని, ఇప్పుడు అటవీ శాఖ అధికారులు వారి భూముల్లో మొక్కలు నాటి రైతుల నుంచి భూమిని లాక్కునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. రైతే రాజు అంటూ గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు వారిపట్ల వివక్ష చూపుతున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం పోడు భూముల సర్వే నిర్వహించిందని సర్వే ప్రకారం అర్హులైన రైతులకు నేటి ప్రభుత్వం పోడు భూముల పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అనేకసార్లు సంబంధిత మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడడం జరిగిందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ వహించి పోడు భూముల సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు.త

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్



మార్కింగ్ వేయిస్తున్న ఎంపీడీవో, ఏఈలు

బేల: మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో 2వ విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన 15 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బుధవారం ఎంపీడీవో మహేందర్‌కుమార్ మార్కింగ్ వేయించి, పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 15 తేదీ లోపు ఇళ్ల పునాదులు పూర్తి చేయాలని, లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీవో మహేశ్‌కుమార్, ఏఈ వినోద్, పంచాయతీ కార్యదర్శి నితిన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఉపాధికల్పన కార్యాలయంలో పేటీఎంలో సేల్స్ ఎగ్జిక్యూటీవ్ కోసం బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో నిరుద్యోగులు హాజరయ్యారు. పదో తరగతి, ఇంటర్ అర్హతతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పేటీఎం సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌కు రూ.15వేల వేతనంతో పాటు రూ. 12వేల వరకు ఇన్సెంటీవ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 55 కిలో మీటర్ల పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

తక్కువ ధరకే వ్యవసాయ ఉపకరణాలు

ఆదిలాబాద్‌టౌన్: రాబోయే ఖరీఫ్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు తక్కువ ధరకే బ్యాటరీ పంపులు, పెట్రోల్ పంపులు, తాడిపత్రులు అందించడం జరుగుతుందని లోటస్ రైతుసేవ కేంద్రం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు జూన్ 1 నుంచి తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ తగ్గింపు ధర జూన్ 15 వరకు ఉంటుందన్నారు. వస్తువులు కొనుగోలు చేసిన రైతులకు ప్రమాద బీమా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు ఆధార్, సంబంధిత పత్రాలతో హాజరు కావాలని కోరారు.

పర్సు అందజేత

బోథ్: మండల కేంద్రానికి చెందిన వేముల శ్రీనివాస్ మంగళవారం రాత్రి తన పర్సును పోగొట్టుకున్నాడు. బోథ్‌కు చెందిన సుల్తాన్‌కు దొరికింది. స్థానిక యువకుడు మాసం అనిల్ కుమార్‌కు పర్సు దొరికిన విషయాన్ని సుల్తాన్ తెలపగా, వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. శ్రీనివాస్‌కు చెందినది గుర్తించి, సమాచారం ఇచ్చారు. అందులో రూ. 9000లతో పాటు విలువైన పత్రాలు ఉన్నాయి. దొరికిన పర్సును అందజేసిన సుల్తాన్‌ను గ్రామస్తులు, పోలీసులు అభినందించారు.

వర్షాలతో జొన్న రైతుల ఆందోళన



జొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో కేంద్రే ఆకాష్

నార్నూర్: గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జొన్న రైతులు బెంబేలెత్తుతున్నారు. చేతికివచ్చిన పంట చేజారిపోవడంతో రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. నార్నూర్ మండలంలోని మాన్కాపూర్, రాజులగూడ, తాడిహత్నూర్, గంగాపూర్, నాగల్ కొండ శివారులో దాదాపు 1500 పైగా ఎకరాల్లో రైతులు జొన్న సాగు చేస్తున్నారు. దాదాపు 60 శాతం మంది రైతులు జొన్న పంటను సాగు పూర్తి చేయగా.. మిగితా 40శాతం మంది రైతులు పంట కోయలేదు. దీంతో చేతికి వచ్చిన పంట చేజారిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం మండల వ్యవసా య శాఖ అధికారి కేంద్రే ఆకాష్ దెబ్బతిన్న జొన్న పంటను పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిస్తానని పేర్కొన్నారు.

పంట మార్పిడితో తెగుళ్ల నివారణ



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాంప్రసాద్

తాంసి: రైతులు పంట మార్పిడితో తెగుళ్లను నివారించవచ్చని ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రాంప్రసాద్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పొలోది గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు అందిస్తున్న వివిధ సేవలపై అవగాహన కల్పించారు. భూసారం దెబ్బతినకుండా పంటల సాగు, వివిధ అంశాల గురించి వివరించారు. ప్రస్తుతం విత్తనాలను కొనుగోలు చేసే బిల్లులను తప్పకుండా తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు. సాగులో ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ప్రవీణ్ కుమార్, ఏవో రవీందర్, ఏఈవో శివప్రసాద్, ఆశన్న, వినోద్, నర్సింగ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ముందస్తు కార్యాచరణ



వీసీలో పాల్గొన్న కమిషనర్ సీవీఎన్ రాజు

కైలాస్‌నగర్: వర్షాకాలంలో ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు కారాత్యచరణను సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆయన బల్దియా జవాన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వరద ప్రాంతాల్లోని డ్రెయినేజీలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షపునీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టినట్లుగా తెలిపారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా అన్ని కాలనీల్లోని డ్రెయినేజీలను శుభ్రం చేయాలన్నారు. ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేయడంతో పాటు 24/7 సేవలు అందించేలా ప్రత్యేక బృందాలను నియమించనున్నట్లుగా వెల్లడించారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఓంప్రకాష్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయ శిక్షణ రాష్ట్ర పరిశీలకులు బొచ్కర్ ఓంప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్పీఎల్ పాఠశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు పద్యం ఉశ్వాస నిశ్వాస లాంటిదన్నారు. బోధన ప్రమాణాలను మెరుగుపర్చుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ నీలాదేవి, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి శ్రీకాంత్ గౌడ్, రిసోర్స్ పర్సన్లు చిల్క పొచ్చన్న, కలీమొద్దీన్, సామల రాజవర్ధన్, ఆశన్న పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు లేక అవస్థలు



వంతెన వద్ద బురదమయంగా అప్రోచ్ రోడ్డు

బజార్‌హత్నూర్: మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర రహదారి , ఇచ్చోడ సొనాల ఆర్అండ్‌బీ రహదారిలో కొలారి వద్ద నిర్మించిన వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రూ. 2కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో వంతెన నిర్మించి రెండు సంవత్సరాలు గడిచినా.. అప్రోచ్ రోడ్డు నిర్మించారు. చిన్న వర్షానికే వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. బైకులు ముందుకు వెళ్లలేక పోతున్నాయి. ఈ రహదారి గుండా రోజుకు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. వచ్చే వర్షాకాలం ప్రయాణికులు ఇబ్బంది పడకుండా అధికారులు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

వంతెన కూల్చివేతపై విచారణ జరిపించాలి

కైలాస్‌నగర్: భోరజ్ మండలంలోని తర్నం వంతెన కూల్చివేతపై విచారణ జరిపించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. తాత్కాలిక వంతెన దాటుతూ వరద ఉధృతికి కొట్టుకుపోయిన లాండ్గే దత్తు కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

రోడ్డుపై మురుగు



ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ నుంచి భుక్తాపూర్ కాలనీ మీదుగా పంజాబ్‌చౌక్ వరకు పది మీటర్ల వెడల్పుతో కూడిన భారీ డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపట్టారు. భుక్తాపూర్ వరకు, అటు బుద్ధ విహార్ నుంచి పంజాబ్ వరకు నిర్మాణం పూర్తయింది. మధ్యలో స్థల వివాదం కారణంగా పనులు నిలిచిపోయాయి. మంగళవారం కురిసిన భారీ వర్షానికి వరద, మురుగు నీరు రోడ్లపైకి చేరింది. దీంతో కాలనీవాసులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. – సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ప్రారంభానికి నోచుకోని గురుకుల పాఠశాల



జైనథ్ మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల నిర్మాణం పూర్తయినా.. ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఈ ఏడాదైనా ప్రారంభం అవుతుందో? లేదో? తెలియని అయోమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు. పాఠశాలను మాత్రం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గురుకుల భవనాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు – జైనథ్

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: విద్యాభివృద్ధికి నిత్యం పాటుపడుతున్న ప్రజాప్రభుత్వం ఖానాపూర్ నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడేన్సియల్ స్కూల్ మంజూరు కావడంతో బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడేన్షియల్ స్కూల్ మంజూరు కావడంతో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు.ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, కాంగ్రెస్ నాయకులు జహీర్, మసుద్, కొమరయ్య, నాగోరావ్, గోపాల్‌సింగ్, జితేందర్, గేడం సుమన్‌బాయి, మానిక్‌రావ్ పాల్గొన్నారు.